క్లుప్తంగా

సామూహిక అన్నప్రాసన



అన్నప్రాసన చేస్తున్న సర్పంచ్ త్రివేణి

తిమ్మాపూర్: మండలంలోని పొరండ్ల గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మంగళవారం సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రెడ్డి త్రివేణి ముఖ్య అతిథిగా హాజరై అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, ఆశ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్ల పరిశీలన

వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో దళితబంధు కింద మంజూరైన యూనిట్లను ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ సెంటర్, ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రానికి ఎంతమంది చిన్నారులు వస్తున్నారు, వారికి అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు అడిగారు. వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రభాకర్, సర్పంచ్ బండ సుజాత, ఎంపీటీసీ మూల రజిత ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం

మానకొండూర్: మండల కేంద్రంలోని చాణక్య హై స్కూల్ విద్యార్థులు రుద్రోజు మాధురి, మణికంఠ, షణ్ముకను అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ శాలువాతో సన్మానించారు. పంజాల వేణుగోపాల్‌గౌడ్ గురుస్వామి, అయ్యప్ప స్వాములు కలిసి ఏర్పాటు చేసిన ఉచిత తేనీరు విడిది శిబిరం ముగింపు కార్యక్రమంలో అయ్యప్ప భక్తి గీతాలను విద్యార్థులు అద్భుతంగా ఆలపించిన సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను సన్మానించారు. పాఠశాల కరస్పాండెంటు ఆడెపు రవీందర్, తదితరులు ఉన్నారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న సింగిరెడ్డి క్రిష్టారెడ్డి

చొప్పదండి: ప్రధాని మోదీ పాలనలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు సంభవిస్తున్నాయని ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ సింగిరెడ్డి క్రిష్టారెడ్డి అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్ర సంఘటన సంయుక్తంగా చొప్పదండిలో నిర్వహించిన యువతలో నాయకత్వ అభివృద్ధి ద్వారా సామాజిక వికాసం అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో యూనివర్సిటీ, కళాశాలల్లో సీట్లు పెంచుతూ మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. మోదీ రాక ముందు 680 యూనివర్సిటీలు ఉండేవని ఇప్పుడు వెయ్యికి పెరిగాయన్నారు. కొన్ని సబ్జెక్టులు తప్పనిసరిగా చదవాలనే నిబంధనల నుంచి ఆసక్తి ఉన్న సబ్జెక్టులు చదివే విద్యా విధానం రాబోతోందన్నారు. దేశ చరిత్రను భవిష్యత్‌కు అందించాల్సిన ఆవశ్యకత యువతపై ఉందన్నారు. సమావేశంలో తాడూరి శివక్రిష్ణ, అనుకారి సాయిక్రిష్ణ, రాజు, శివకుమార్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి'



మాట్లాడుతున్న వాసుదేవారెడ్డి

హుజూరాబాద్: ప్రజా, కార్మిక రైతువ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశభక్తి ముసుగులో దేశ సంపదను కొల్లగొడుతూ కార్పొరేట్ సంస్థలకు బీజేపీ వత్తాసు పలుకుతుందని, రైతు వ్యతిరేక చట్టాలపై రైతుల ఉద్యమంతో వెనక్కి తగ్గిందని, ఉద్యమ సమయంలో అమరులైన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్కరణ చట్టం అమలైతే ఉద్యోగులకే కాకుండా యావత్ రైతాంగానికి తీవ్ర నష్టమని పేర్కొన్నారు. రైతాంగం పట్ల కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ నీటమూటలైందని, విత్తన చట్టం లేకపోవడం మూలంగా బహుళ జాతి కంపెనీలు ఇష్టారాజ్యంగా విక్రయాలు జరుపుతున్నాయన్నారు. సమావేశంలో గుండేటి వాసుదేవ్, కదిరే రమేశ్ ఉన్నారు.



పల్లెకు పచ్చతోరణం

శంకరపట్నం: హరితహారంలో నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదిగి ఆకుపచ్చ తోరణంగా బాటసారులను ఆకట్టుకుంటున్నాయి. మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలోని చింతలపల్లె రోడ్డుకు ఇరువైపులా సర్పంచ్ పల్లె సంజీవరెడ్డి మొక్కలు నాటించారు. గ్రామానికి వచ్చేవారికి స్వాగతం పలుకుతున్నట్టు కిలోమీటర్ పొడువున పచ్చని చెట్లు స్వాగతం పలుకుతున్నాయి.

పరీక్షల భయం పోయేలా..



ప్రేరణ తరగతుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మానకొండూర్: మండలంలోని పోచంపల్లి మోడల్ స్కూల్ పది, ఇంటర్మీడియట్ విద్యార్థులకు విక్టరీ అకాడమీ ఆధ్వర్యంలో ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నారు. సోమవారం అకాడమీ చైర్మన్ టి. అనంత పద్మనాభస్వామి పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, సమయం ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియజేశారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకావొద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అర్చనప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందని ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు. ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏడు నుంచి పదో తరగతి వరకు మిగిలిన ఉన్న సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు.

మొగిపురుగు నివారణపై అవగాహన

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మొగిపురుగు నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నివారణకు చేపట్టాల్సిన చర్యలను మండల వ్యవసాయాధికారి వంశీక్రిష్ణ వివరించారు. వ్యవసాయ క్షేత్రాల్లో మొగి పురుగుతో కలిగే నష్టాన్ని పరిశీలించారు.

పాడిపరిశ్రమ రైతులకు లాభదాయకం



మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రవీందర్

చిగురుమామిడి: రైతులకు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ ఎంతో లాభదాయకమని జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని సుందరగిరి, బొమ్మనపల్లి గ్రామాల్లో పాంతీయ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంకరజాతి పాడిపశువులు ఎదకు రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, నూతన సాంకేతికత అందిపుచ్చుకుని తగిన వైద్యం అందిస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ లింగారెడ్డి, నిపుణులు, డాక్టర్ విజయ్‌కుమార్‌శర్మ, సత్యనారాయణశర్మ, ఎస్పీ రెడ్డి, డాక్టర్ రాజిరెడ్డి, చైతన్య, దివ్య, చిగురుమామిడి పశువైద్యాధికారి శ్రీధర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు రమేశ్, భూంరెడ్డి, ఎంపీటీసీలు తిరుపతి, మల్లేశం, పాల సంఘం అధ్యక్షులు సంపత్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 200 పశువులకు పరీక్షలు చేసి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

చిన్నారులతో పనులు చేయించొద్దు



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

చిగురుమామిడి: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని, చిన్నపిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం చిగురుమామిడిలోని పౌల్ట్రీఫాంలను తనిఖీ చేశారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని, పిల్లలను బడిలో చేర్పించి విద్యనందించాలన్నారు. చిగురుమామిడి, సుందరగిరి కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శోభారాణి, రవీందర్‌రెడ్డి, టీచర్లు రాజేశం, సీఆర్పీలు అంజనేయులు, శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందిస్తున్న ఇర్ఫాన్, తదితరులు

హుజూరాబాద్: పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం హుజూరాబాద్–జమ్మికుంట జమాతే ఉలేమా సభ నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మౌలానా ఇర్ఫాన్ కాస్మి హాజరై మాట్లాడారు. ఆర్థికంగా ఎదిగినవారు నిరుపేదలకు సహాయపడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. అనంతరం జమాతే ఉలేమా ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డివిజన్ మసీద్ ఈద్గా కబ్రస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, ఉమ్మడి జిల్లాల ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు గులాం హమ్మద్, బీఆర్ఎస్ నాయకుడు సాజిద్ ఖాన్, హుజూరాబాద్, జమ్మికుంట జమాతే ఉల్మా అధ్యక్షులు మిర్జా ఇమ్రాన్ బేగ్, జిల్లా అధ్యక్షుడు ముఫ్తీ యూనిస్ కాస్మి, జిల్లా ఉపాధ్యక్షులు గయాస్, ముఫ్తిషాకిర్, మౌలానా,నయీమ్,నజీర్, సుపియాన్, సలీం, అజర్, నయ్యర్ తదితరులు ఉన్నారు.

సీఐటీయూ జెండావిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న ఎండీ అజ్జు

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ అనుబంధ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం సీఐటీయూ మండలాధ్యక్షుడు ఎండీ అజ్జు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే ధర్నా కార్యక్రమానికి అన్ని రంగాల కార్మికులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. జెండావిష్కరణలో ప్రధాన కార్యదర్శి తూముల కుమరస్వామి, ఉపాధ్యక్షులు ఆర్ సరోజన, ఆర్. క్రాంతికుమార్, గొట్టం రాజమౌళి, గొర్రె సమ్మక్క, సహాయ కార్యదర్శి జిల్లా రాజేశ్, కోశాధికారి రొంటాల రాజేశ్వరి, ప్రచార కార్యదర్శి బోరగాల రాజకుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జీ వావిలాల చిరంజీవి, కమిటీ సభ్యులు ముక్క భిక్షపతి, మాడపాక ఐలయ్య, సుశీల, రామగిరి సులోచన, రొంటాల అన్నపూర్ణ, శ్రీనివాస్, మొలుగూరి సతీష్, రొంటాల మహేష్ తదితరులు ఉన్నారు.

అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలి

వీణవంక: బెంగుళూరులో ఈ నెల 18నుంచి 22వరకు జరిగే సీఐటీయూ అఖిల భారత మహా సభలను విజయవంతం చేయాలని హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పిల్లి రవి యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఎల్బాకలో మహాసభలను పురస్కరించుకొని జెండా ఆవిష్కరించారు. కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, హక్కుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. మహా సభలకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, వేణుకుమార్, కుమార్, ఎల్లయ్య, అనిల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బాలికలు చదువుకు దూరం కావొద్దు



బాలికలకు సైకిళ్లు అందిస్తున్న జమునారాణి, తదితరులు

చొప్పదండి: బాలికలను ఉన్నత చదువులు చదివిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఉమెన్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జమునారాణి అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నిరుపేద బాలికలకు మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లు, కుట్టు మిషన్లు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దూరభారంతో బాలికలు విద్యకు దూరం కావద్దనే సంకల్పంతో సైకిళ్లు అందించామని, బాలికా విద్యను సంస్థ ఆధ్వర్యంలో ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. బాలికలు చదువుకున్నప్పుడే నిజమైన సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. సైకిళ్లు, కుట్టుమిషన్లు సద్వినియోగం చేసుకొని విద్యలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరారు. వలంటీర్ ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఎం రాధారాణి, ఉపాధ్యాయులు మాడుగుల రాములు, ఏసుదాసు, రాజమణి, తిరుపతి, లక్ష్మి, పల్లవి, శ్రీధర్, క్రాంతి, సూర్య ప్రకాశ్, గోపాల్, రేణుక, తదితరులున్నారు.

ఉపసర్పంచ్‌పై నెగ్గిన అవిశ్వాస తీర్మానం



చేతులెత్తి మద్దతు తెలుపుతున్న వార్డు సభ్యులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆర్డీవో హరిసింగ్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉపసర్పంచ్ తాళ్లపల్లి రమారాజేందర్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ వార్డు సభ్యులు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. సమావేశానికి వార్డు సభ్యులు తాళ్లపల్లి వెంకటేశ్, ఇల్లందుల సది, మునిగాల సుమలత, రావుల ప్రవంతిరూపిరెడ్డి, నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. ఉపసర్పంచ్ గైర్హాజరుకాగా, పదిమంది వార్డు సభ్యులకు ఆరుగురు సమావేశానికి హాజరై అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపారు. మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు ఉప సర్పంచ్‌ను పదవి నుంచి తొలగిస్తున్నామని అధికారులు తెలిపారు. గ్రామ సభ తీర్మానం అంశాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆర్డీవో తెలిపారు. నూతన ఉపసర్పంచ్ ఎన్నికకు మరో తేదీ ఖరారు చేస్తామన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

జమ్మికుంట: కంటి వెలుగు రెండో దశ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యలయంలో వైద్య,మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్లు, అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలకు తెలియజేయాలన్నారు. కంటి చికిత్స అవసరం ఉన్న వారిని గుర్తించి, వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు పథకాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ దొడ్డె మమతప్రసాద్ అన్నారు. ప్రతి గ్రామంలో జనభా ప్రకారం కంటి పరీక్షల నిర్వహణ తేదీలు ప్రకటిండం జరుగుతుందన్నారు.

మానకొండూర్‌రూరల్: ఎంపీడీఓ ఆఫీసులో కంటివెలుగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సమన్వయంతో కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

చిగురుమామిడి: కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ కొత్త వినీత అన్నారు. మండలపరిషత్ సమావేశం మందిరింలో కంటి వెలుగుపె అవగాహన సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు.

రామడుగు: ఈ నెల 18 నుంచి చేపట్టే కంటి వెలుగుపై బుధవారం సన్నాహక సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్ర తెలిపారు.

చొప్పదండి: రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ప్రత్యేకాధికారి రాంబాబులు కోరారు. కంటి వెలుగుపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శంకరపట్నం: రేషన్‌బియ్యంలో కోత విధించొద్దని డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌కు వ్యవసాయకార్మిక సంఘం నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ బియ్యం కొనసాగించాలని కార్యాలయం ముందు ఆందోళన చేశారు. కేరళలో 14 సరుకులు పంపిణీ చేస్తున్న విధంగా రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, యుగేందర్, కొ ంరయ్య, మల్లయ్య, రాములు, రవీందర్ ఉన్నారు.

ఉప్పరమల్యాల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేశ్

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల గ్రామ కాంగ్రెస్ కమిటీని మండల శాఖ అధ్యక్షుడు పురమల్ల మనోహర్, మండల కన్వీనర్ తాజొద్దీన్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేశ్, మైనార్టీసెల్ అధ్యక్షుడిగా ఎండీ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశం, యూత్ అధ్యక్షుడిగా కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అజయ్, బీసీసెల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా రమేష్, కార్యదర్శిగా పోచమల్లు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బబ్లూ, కార్యదర్శిగా వెంకటి, కార్యదర్శిగా లచ్చయ్య, ఉపాధ్యక్షుడిగా అంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా రాజు ఎన్నికయ్యారు. నాయకులు రాజిరెడ్డి, చక్రపాణి, బుచ్చన్న, నాగేందర్‌రెడ్డి, మోహన్, మల్లేశం పాల్గొన్నారు.

పరిశుభ్రతే ప్రధానం

- ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్య సమాచారం సేకరణలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు
- వ్యాక్సినేషన్, సీజనల్ వ్యాధులపై అవగాహన
- ప్రజలను అప్రమత్తం చేయడంలో నిమగ్నం



పెద్దపాపయ్యపల్లిలో వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు

హుజూరాబాద్‌రూరల్: వారందరూ కింది స్థాయి సిబ్బంది... తమ విధుల్లో ఎటువంటి లోపం లేకుండా నిర్వహిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. కరోనా మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా విపత్కర సమస్యలను సృష్టించింది. మళ్లీ కోవిడ్‌పై ఆందోళన చెందకుండా క్షేత్ర స్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పిస్తున్నారు. సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ చర్యలు వివరిస్తున్నారు. మరోవైపు దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులను చైతన్యవంతం చేయడంలో నిమగ్నమవుతున్నారు.

మేమున్నామంటూ భరోసా

కరోనాతో సమయంలో వైద్య ఆరోగ్యశాఖ సేవలు మర్చిపోలేనివి. అందులోనూ ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తల సేవలు అమోఘం. హుజూరాబాద్ మండల వ్యాప్తంగా ఏఎన్‌ఎంలు 25, ఆశ కార్యకర్తలు 61 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ తిరుగుతూ అనారోగ్య సమస్యలుంటే మేమున్నామంటూ భరోసా కల్పిస్తున్నారు. ప్రభుత్వం అందించే మందులు అందజేయడమే కాకుండా ఆరోగ్య పరిస్థితి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఉదయం నుంచే..

కరోనా వ్యాప్తి నుంచి ఏఎన్ఎం, ఆశ కార్యకర్తల బాధ్యతలు మరింత పెరిగాయి. మరోవైపు అంటు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రతలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తెలియజేస్తున్నారు. మళ్లీ కరోనా కేసులు నమోదు అయితే ప్రజలను వాటి నుంచి రక్షించేందుకే క్షేత్ర స్థాయిలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఉదయం లేచింది మొదలు గ్రామాలు, కాలనీల బాట పడుతున్నారు. ఇంటింటికీ వెళ్లి టీకాల ఆవశ్యకత, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామ కూడళ్లు, పంట చేలల్లో, ఆ టోలు, బస్సులు ప్రతి అవకాశం సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. వారి కృషి ఫలితంగా హుజూరాబాద్ మండల వ్యాప్తంగా కోవిడ్ వ్యాక్సినేషన్ వందశాతం పూర్తయింది.

అవగాహన కల్పిస్తున్నాం



గ్రామాల్లోని ప్రజలకు వైద్య ఆరోగ్య శాఖ జారీ చేసిన ఆరోగ్య సూచనలను తప్పనిసరిగా తెలియజేస్తున్నాం. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, చి న్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సమగ్రంగా వివరిస్తున్నాం. ప్రతి ఒక్కరూ పరిసరా లు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం.

– తాడూరి లత, ఆశ వర్కర్, కాట్రపల్లి

భయం తొలగిస్తున్నాం



ఇప్పటికీ టీకాలు వేయించుకొని వారి వివరాలను సేకరించి వారి ఇళ్లకు వెళ్లి టీకా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గూర్చి వివరిస్తున్నాం. టీకాపై ఉన్న భయం తొలగిస్తున్నాం. అలాగే అంటు వ్యాధుల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సూచనలు, జాగ్రత్తలు తెలియజేస్తున్నాం.

– శశికళ, ఏఎన్ఎం, హుజూరాబాద్

జాగ్రత్తలు పాటించాలి



ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. రోగాలు విజృంభిస్తున్న నేపథ్యంలో వ్యక్తిగత, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. అర్హులు కోవిడ్ టీకా తీసుకోవాలి. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలి.

– మధుకర్, వైద్యాధికారి, చెల్పూర్ పీహెచ్‌సీ

పరామర్శ

వీణవంక: రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.